# మాధవి కథనం

"నేను ఎప్పుడో అనుకున్నాను యిలా జరిగి తీరుతుందని, యిలా కాక యింకోలా జరగదనీ. అవును మరి. నేను నాకే అర్థం కాకుండా పోతానా ! అన్న ధీమాతో ఇలాగ జరిగితీరుతుందని ఊహించాను. కాని తర్వాత పూర్తిగా ఎందుకూ పనికిరానని తెలిసింది. నన్ను నేను అర్థంచేసుకున్నానన్నది ఉత్త భ్రమేనని.

...అతను — ప్రభాకరం కొత్తగా పరిచయమైన రోజులలో ఎంత హాయిగా కాలం గడిచిపోయేది. వారాలు నెలలూ క్షణాల్లా గడిచిపోయేవి. కాని ఇప్పుడో ? ఓ పట్టాన రేపుగా మారడంలేదు. ఈరోజు రేపు అయ్యేలోపు ఎన్ని రకాల ప్రశ్నలకూ, ఎన్నివిధాలైన మానసిక సంక్షోభాలకూ గురికావలసివస్తోందో ? ... ఈ కటకటాల్లోంచి చూస్తూ ఇంకా ఎంతకాలం గడపాలి ? వారమా ? రెండు వారాలా ! ఇంకా ఎన్ని రోజులు ? ఎంత మరచిపోదామన్నా ప్రభాకరం జ్ఞాపకంరాకుండా వుండడు. జ్ఞాపకంవచ్చినప్పుడల్లా— అంత ఉదాత్తంగా మాట్లాడే, మాటల్లో మహామహులు సృజించే ప్రభాకరం ప్రవర్తన, అంతా...అంతా ఏమిటి ? నటనేనా ? ... యింత జరిగాక కూడా, అదంతా నటన. నిజమైన ప్రభాకరం ఏం చెయ్యాలో అది చేసి నన్ను వదిలాడు, అనిపించదేం...

ప్రభాకరం ఆ రోజు ఆయనకోసం వచ్చాడు; అతని ఎత్తైన విగ్రహం, నిండైన ఛాతీ నన్ను పిచ్చెత్తించాయి. గృహిణిగా అలా పిచ్చెత్తిపోకూడదు, గాని ప్రభాకరం

సమ్మోహనశక్తి అలా అనిపించింది. అతని సాంగత్యంకోసం,
లాలనకోసం, హృదయం తహతహలాడింది. అందుకే ప్రభా
కరాన్ని నా యీ చేతులతోనే దగ్గరకు తీసుకొని హృద
యానికి చేర్చుకున్నాను...

"మాధవీ! ఓ మాధవీ! నీ పేరులోనే వుంది నీ
సొగసు. దాన్ని ఉచ్చరించడమే నా సుఖం. మాధవీ, నన్ను
వ్వాడూ, ఇలా, ఈ దగ్గిరగా తీసుకున్న చేతులతోనే
దూరంగా నెట్టెయ్యకేం?" అంటూ ఎంతో జాలి గొలిపే
కంఠస్వరంతో ప్రభాకరం అంటూంటే నా హృదయం
ఆనందంతో పరవశ్యతో క్కేది. అదే హృదయం ఇప్పు
డెందు కింత మోడువారిందో?

ఆ రోజు జన్మ జన్మాలా మరచిపోలేను. ఆయనకోసం
ఎందుకో అర్జంటుగా ప్రభాకరం వచ్చాడు. ఆయన లేరు.
నే నున్నాను. ప్రభాకరానికి అంతకన్నా కోరుకోదగిన అవ
కాశం లేదు. నాకూ అంతే. ఆరోజు ఎన్నెన్ని మాట్లాడు
కున్నాం? ఎంత వింతగానో నవ్వుకున్నాం! ... కాని
ఆరోజే, నా కొంచెం ఆలోచనాశక్తి భగవంతు డిచ్చి
వుంటే! ఆరోజే, నువ్వుచేసేది బాగులేదు, ఒక ప్రాణంతో
చెలగాటం ఆడుతున్నావు. వృథాగా నాశనం అయిపోతావు-
అని ఎవరో చెప్పివుంటే! ఎంత బాగుండును?... అయినా
ఎవరైనా చెప్తే వినేదాన్నా? ప్రభాకరాన్ని పొరకప్పిన
కళ్ళతో చూస్తే ఏ ఆడదిమటుకు సవ్యంగా వుంటుంది?
ప్రభాకరం ఆరోజు అన్నాడు; యీ చెవులతోనే

విన్నాను. విని హృదయంలో పదిలంగా దాచుకున్నాను. అంత పదిలంగా దాచుకోబట్టే యిప్పుడింతగా బాధ పెడుతున్నాయి ఆనాడు అత డన్న మాటలు.

"మాధవీ, నువ్వు నా ఎదురుగుండా లేకుంటే నేనేం రాయగలను ? నువ్వు నా ఎదురుగుండా కూర్చుంటే రసపూరిత రచనల్ని చేయగలను. మాధవీ, నా మాట విను; నన్ను కరుణించు"...అని తనను బతిమాలుతూంటే...ఒళ్లు తెలియని ఆవేశం వచ్చి బిగియార కౌగలించుకొన్నాను. బహుశా ఆరోజే తెలుసుకొని వుంటాడు—నేను పూర్తిగా అతనిదాన్ననని ! ... ఆ ధైర్యంతోనే ఆయన వున్నా లేకున్నా రావడం మొదలుపెట్టాడు. ప్రభాకరంలాంటి వ్యక్తి ఏకాంతంగా నాలాంటి కాంత వున్న చోటికి వస్తే ఏం జరుగుతుంది ?—ఏం జరగాలో సరీగ్గా అదే జరిగింది. రాను రాను మాధవినే ప్రభాకరాన్నయిపోయాను. ప్రభాకరమే మాధవి అయిపోయాడు. చిత్తచాంచల్యమంటే ఏమిటో తెలియనన్నాళ్లూ పట్టలేదు తెలుసుకోనేందుకు. ఆయనను దేవుడుగా పూజించనిరోజులు లేకపోలేదు. పరపురుషుడు స్వీయ వూహాలలో ఎప్పుడూ తలెత్తలేదు. కాని అంతా విధి ! ఎలా జరగాలో అలా జరిగింది. ఆయనకు ఒంట్లో బాగులేక రోజు రోజుకు కృశించుతూన్నట్లు కనిపిస్తూనే వున్నారు. అయినా లెక్కచెయ్యలేదు. కాని యింత అఘాయిత్యం చేస్తారని కలలో కూడా అనుకోలేదు. సాయంత్రం షికారుకుపోయి యింటికి వస్తూనే, ప్రభాకరం వచ్చాడా? అంటూ ఎంత ఆప్యాయంగా పలకరించారు? నాకేం తెలుసు

అదంతా వ్యంగ్యం అని ? అందుకే ఎంతో ఆత్రంగా "అయ్యో, ఈవేళెందుకో రాలేదండీ, మీతో ఏమైనా చెప్పాడా ?" అనేదాన్ని. "ఏమైనానీతోనే చెప్పివుంటాడని నిన్నే అడుగుతున్నాను మాధవీ," అని ఆయన అనేసరికి సిగ్గుతో ప్రాణంచచ్చిపోయేది. కాని ఏదో మధురావేశంతో ముఖం జేవురించేది. లోపలికి వెళ్ళిపోయేదాకా అలాగే చూస్తూ నుంచునేవారు. అప్పట్లోనే, కొంచెం ఆయనను గురించి శ్రద్ధ తీసుకొనివుంటేనో?...యిప్పుడనుకొని లాభం ఏమిటి ?

నేను కలలో కూడా ఊహించని సంఘటన ఆరోజు జరిగింది. ఆయనకు ప్రాణంమీదికి వచ్చి హాస్పిటలు చేర్చారు. నేనూ వెంబడి పోయాను. హృదయంలో ఏదో తెలియనిభయం పట్టి పీడిస్తూంది. ఏదేనా విపరీతం జరిగితే ! నా శరీరం యావత్తూ కంపించింది. ఆ భయంలో ఒళ్ళు తెలియక ప్రభాకరంచేతినే గట్టిగా పట్టుకుని కూర్చున్నాను. ఆ చేయి వెచ్చదనం కొంచెం ధైర్యాన్ని యిస్తుందని ఆశ. ప్రభాకరంకూడా పిచ్చివానిలా తిరుగుతున్నాడు. డాక్టరు చాలా సీరియస్ కండిషన్, ఆశ చాలా తక్కువ అన్నాడట. ఇంకెలాగ ? ప్రభాకరం బయటికి వెళ్ళి కుర్చీలో కూర్చున్నాడు. ఆ మరుక్షణమే ఆయన కళ్ళు తెరిచి, మాధవీ అంటూ పిలిచారు. ఎందుకు ? అంటూ దగ్గరకు వెళ్ళి కూర్చున్నాను. ఆయనముఖం చూడ్డానికి కూడా భయంకరంగా వుంది. కళ్ళు రెండూ చింతనిప్పుల్లా వున్నాయి. "చూడు మాధవీ, నీ పేరు ఎంత మృదువుగా ధ్వనిస్తుందో నువ్వంత

కఠినాత్మురాలివి. న న్నెంత క్షోభ పెట్టావు? యిదంతా నిన్ను అమితంగా ప్రేమించినందుకా యిలా చేశావు? నీ కేం లోటుచేశాను?" ఏం లోటుచేయలేదు అనక ఏం లోటు చేశాను అంటాలేమిటి అనిపించింది. మరి చేసినదంతా లోటేనాయిరి. ఏ ముహూర్తాన మా నాన్న నా కీ సంబంధం నిశ్చయించాడో... అన్నీ అపశకునాలే కన్పడ్డా యుంటుంది అమ్మ. నిజమే. దుక్కలా తిరిగే అన్నగారు గుండె ఆగి చచ్చిపోయాడు పెళ్ళి వారం వుండనగా. పెళ్ళి కాస్తా వెనకబడింది... యీ లోపల ఎన్ని పుకార్లు! పిల్ల అదృష్టమట. ఏం అదృష్టమో! అయినా ఎవరి అదృష్టం దురదృష్టం వాళ్ళదే కాని యితరులదికాదు కదా? ఏం లోకమో, ప్రతి చిన్న తప్పటడుగుకూ దుమ్మెత్తిపొయ్యడం తప్ప, ఎందుకా తప్పటడుగు పడిందో ఆలోచించదు. సంఘం ఊరుకోదంటూ ఏది సులభంగా వుంటే ఆ పని చేసేయడం, తర్వాత పిల్ల రాత! ఈ సంఘం ఎక్కడిదో? దానికీ పిల్ల భావికీ సంబంధం ఎందు కుండదో? నాన్నతో అమ్మ శత పోరింది. ఈ సంబంధ మొద్దు, పిల్లాడు అర్భకుడు. ఆరోగ్యం అసలేలేదు అని. నాన్న వింటేనా? కట్నం, కానుకలూ అక్కర్లేదు. కానీ ఖర్చులేకుండా పెళ్ళిచేసినా మా కేం ఇబ్బంది లేదు అన్నారట వాళ్లు. ఇది మించిపోతే యిలాంటి వరుడు మళ్ళీ తటస్థపడతాడా! ... అందుకే ఆరు నూరైనా కాని నాన్న యిది మటుకు కాలదన్ననన్నాడు. అందుకే అమ్మ ఎంత మొత్తుకున్నా, నా కెంత యిష్టంలేకున్నా వివాహం జరిగిపోయింది. పెళ్ళయిన రెండో నెలలోనే వేరింటి కాపు

రానికి పట్నం వచ్చేశాం. పట్నంలో ఎంతో హాయిగానే కాలక్షేపం జరిగిపోయేది. పగలంతా యింట్లో ఏదో అవీ యివీ సర్దుతూ కాలక్షేపంచేసేసేదాన్ని. సాయంత్రం ఆయన ఆఫీసునుండి రాగానే ఎక్కడికేనా తిరగడానికి వెళ్ళేవాళ్ళం. కాని అలా ఎంత కాలం? వారంలో నాలుగైదురోజులు ఆయనకు ఒంట్లో బాగుండదు. మెడకు మఫ్లరు చుట్టి ఆస్పత్రికి వెళ్ళవలసిందే. పోనీ అని ఇంట్లో వుండి రెస్టుతీసుకొనేందుకు లేదు. ఆఫీసుకు హాజరుకావలసిందే. రాత్రంతా ఆయన మూల్గుతూంటే కాలురాసీ, తలరాసీ తృప్తిపడేదాన్ని. కాని ఎన్నాళ్లు? పాతికేళ్ళేనా నిండని నా జీవితం యిలా ఎన్నాళ్లు గడుస్తుంది! ... అనుకోకుండానే ఏడుపు వచ్చేది. "ఏడుస్తున్నావా! మాధవీ," అని వూరడింపుగానైనా అనని భర్త "ఏంచేస్తాం మాధవీ, నీకూ నాకూ కూడా పెద్దలు అన్యాయంచేశారు. నే నెన్నాళ్ళో మననులే. తరువాత హాయిగా..." అంటూ ఛలోక్తిగా అనే భర్తను చూసి... ఏడవాలా? నవ్వాలా? ఏడ్చేదాన్ని, నవ్వేదాన్ని.

కాని, ఆ రోజు, ఆఫీసునుంచి ఆయనతో కూడ ప్రభాకరం రావడంతో నా జీవితంలో ఒక నూతన ఘట్టం ప్రారంభమైంది. అందులో నాయకుడు ప్రభాకరమే... అప్పటినుంచీ, నేను ఏడ్వడం మరిచిపోయాను.

'చూడు మాధవీ, నేను చచ్చిపోయాకగాని నావిలువ నీకు తెలియదు. బ్రతికివుంటే, నేను అడ్డు అనుకుంటున్నావు. ఇక నే చచ్చిపోయాక, నీ బ్రతుకే ఒక అడ్డు అని వాపోయే రోజు తప్పకవస్తుంది. అప్పుడనుకుంటావు ఏ రోగిష్టో ఆయన

వుంటే బాగుండును అని." అంటూ ఆయన నా చెయ్యి గట్టిగా నొక్కారు. తృళ్ళిపడ్డాను...అవును. ఆయన మరణ శయ్య ప్రక్కన కూర్చుని వున్నాను నేను. ఆ సంగతే మరిచిపోయాను. "మీ రిలా అనకండి. మీరు బాగవు తారు. మళ్ళీ మామూలుగా మనమిద్దరం జీవిద్దాం. నా తప్పులన్నీ క్షమించండి" అన్నాను. దుఃఖంతో గొంతుక పూడుకుపోయింది. "అలా గే లే; కాని యీ ఉత్తరం ప్రభా కరం కియ్యి పోస్టు చెయ్యమని. తర్వాత చూసుకొందాంలే" అంటూ వెనుతిరిగి పడుకున్నాడు. ఏదిక్కూ తోచని అయో మయ పరిస్థితిలో, ఆ ఉత్తరాన్ని ప్రభాకరానికే యిచ్చేదేమి టని అక్కడికి కుర్రాడికిచ్చాను పోస్టు చెయ్యమని...అలా చేయడంవల్ల వచ్చిన నష్టం అనుభవించేదాకా తెలియలేదు.

ఇంకెక్కువ బాధ పడకుండా ఆయన ఆ రోజు చని పోయారు. ఏడిచాను. ఎందుకు ఏడిచానో నాకే తెలియదు. ఆయన పోయారనా? ఆయన పోతే నా జీవితంలో తీరనిలోటు ఏర్పడుతుందనా? ఎందుకు? ఎందుకు ఏడ్చాను?...

...ఆయన పోయిన కొన్నాళ్ళదాకా ప్రభాకరం జాడే లేదు. నా చుట్టూ చుట్టాలున్నారనీ, నన్నోదార్చ డానికి వస్తే ఏమైనా అనుకుంటారనీ రాలేదేమో అను కున్నాను. కాని ఎంత పొరపడ్డానో తర్వాత తెలిసింది. ప్రభా కరానికి నన్ను చూసే ధైర్యం లేదు. ఆయన మరణానికి కార ణం మా బాంధవ్యమే నంటూ నమ్మేడేమో ప్రభాకరం... కాని, యిదికూడా నిజంకాదని తరువాత రుజువైంది...ఆయన పోయి రెండు నెలలు దాటింది. ఇల్లంతా నిర్మానుష్యం. నే

నొక్కలేదనీ. అమ్మా నాన్న తోడు వచ్చారు. అంత స్నేహితుడనిపించుకొన్న ప్రభాకరం, తమ కూతురిని గాఢంగా ప్రేమించానన్న ప్రభాకరం సమయానికి ఆదుకోక పోతాడా అనే నమ్మకంతో అమ్మా నాన్నా ఉన్నారు. రోజులు దొర్లి పోతున్నాయి. ఒకనాటి సాయంత్రం వేళ కోపంతో, ఒళ్ళు తెలియని ఆవేశంలో ప్రభాకరం మేడ మీదికి వచ్చాడు. పాత చనువుతో, "ఏం ప్రభాకరం యిన్నాళ్ళకు మాధవి జ్ఞాపకంవచ్చిందా?" అంటూ దగ్గరకు వెళ్ళాను. "నువ్వు నా దగ్గరకు రాకు. నీ మూలాన్నే యింత అవమానంపాలు కావలసివచ్చింది. చస్తూ చస్తూ మీ ఆయన పోలీసుకు ఉత్తరంరాసి మరీ చచ్చాడు. నీకూ నాకూ కూడని సంబంధం వుందట. మానసిక వ్యధను భరించలేక ఏదో తినిచచ్చాట్ట. ఎలాగా పోయేదానికి ఆ ఉత్తరం కూడా ఎందుకో?" కోపంతో శరీరం యావత్తు కంపిస్తోంది. నాకేసి పురుగును చూసినట్లు చూస్తున్నాడు.

"ఏం తప్పేముంది? మనిద్దరికీ ఏవిధమైన బాంధవ్యం లేదని నువ్వనగలవా ప్రభాకరం!" నా మాట పూర్తికాకుండానే మండిపడుతూ "నీకూ నాకూ ఏమిటి సంబంధం! నిన్ను నువ్వు అద్దంలో ఎప్పుడేనా చూసుకొన్నావా? నిన్ను ప్రేయసిగా ఎవరేనా కోరుకుంటారంటావా ? నువ్వంత ఆత్రుత ప్రకటిస్తే తిరస్కరించేటంతటి ప్రవరుణ్ణనుకున్నావా?" ఎంత హేళనగా నవ్వేడని! నాలో ఒక పిచ్చి ఆవేశం ప్రవేశించింది. ప్రభాకరం తా నన్నమాటలు నాలో ఎలాంటి భావాలను రేకెత్తించాయో అవేనా చూడకుండా

డాబా పిట్టగోడదగ్గర నిలబడి ఏదో చూస్తున్నాడు. నేనూ డాబామీదకు వెళ్లాను. నే నేం చేశానో నా కప్పుడు తెలియ లేదు. కాని తరువాత బాగా తెలిసింది. డాబామీంచి ప్రభాకరాన్ని కిందికి తోసేశాను. నే వళ్ళు తెలియకుండా పడివున్నానట—అమ్మ చెప్పింది. ఆ మరునాడు నాకు అన్నీ బాగా అర్థంఅయాయి. ప్రభాకరం తల పగిలి కొన్ని గంటలలోనే చనిపోయాడు. నేను కటకటాల వెనక్కి వచ్చాను. నాన్న—అన్నీ తెలిసిన నాన్నకూడా నన్ను నా కర్మానికి వదిలేశాడు. ఎక్కువరోజులు సాగకుండానే నాకు నాలుగేళ్లు వేశారు. నాన్న అపీలు ప్రయత్నాలు చెయ్య నన్నాట్ట. అమ్మ ఒకటే ఏడుపు. ఏంచేస్తుంది అమ్మమటుకు?

...ఈ కటకటాల వెనక ఎంతోమంది వున్నారు. కాని అందులో చాలామంది చిన్న చిన్న తప్పులే చేసి వచ్చినవాళ్ళు. వాళ్ళందరికీ నేనంటే ఎంత లోకువ! మొగుణ్ణి నాశనంచేసింది. రంకుమొగుణ్ణి చంపింది. ఎంత ఘటికురాలో అంటూ వాళ్ళు చెప్పుకొనేమాటలు వింటూ కూడా నాకు మతిభ్రమణం కలగలేదంటే అందరికీ ఆశ్చ ర్యంగా వుండడం సంగతి అలావుంచి నాకే విస్మయాన్ని కలిగిస్తూంది.

నాలుగేళ్లూ ఎలాగో గడిచిపోయాయి. యీ నాలు గేళ్ళలోనూ నాకు యిరవయ్యేళ్ళు అధిగమించాయి—అని పిస్తుంది. ఆనాటి పాతికేళ్ళ మాధవికీ యీనాడు యింకో రెండువారాల తరవాత మానవమాత్రులమధ్య మసలడానికి తిరిగివచ్చే మాధవికీ పోలికే వుండదు. ప్రియుని బాహువుల్లో

ఖులా సారోజుల్లో అయితే నాలుగేండ్లూ నాల్గు క్షణాలు! కాని ఏకాంతంలో, యెదలో లోతు కందని వ్యథతో, జైలు వాతావరణపు కాఠిన్యంతో నాలుగేళ్ళు నాలుగు యుగాలు! అయినా మాధవి చచ్చిపోలేదు — ఎలా చచ్చిపోతుంది? ఇంకా ముందుంది నా పని...అనుకుంటే నాకు నవ్వొస్తుంది. నాలుగేళ్ళలో బయటి ప్రపంచంలో ఎన్నో, ఎన్నెన్నో జరిగాయి. నాన్న చనిపోయాడట. అమ్మమాత్రం మిగిలింది. అమ్మ మామయ్యగారింట్లో వుంటోంది- ఒక కండిషనుమీద — జైలునుంచి వచ్చాక నేనుఅక్కడికి రాకుండావుండాలి. "కాపరంచేసే కోడలుంది. ఎదిగిన కూతురుంది. నీ కూతురు ఇక్కడికి రాకూడదు. అలా యిష్టమయితేనే వచ్చి మాతో పాటే వుండు." అన్నాట్ట మామయ్య అమ్మతో. అందుకే నేనూ అనుకుంటున్నాను: వెళ్ళకూడదని. వెళ్ళి ఆమె జీవితం దుఃఖభాజనం చేయకూడదని. మరెక్కడికి వెళ్ళడం- అంటే సంక్షేమ కార్యకర్తల ధర్మమా అంటూ చాలా శరణాలయా లున్నాయి. ఎక్కడో అక్కడ తలదాచుకుని కాలం వెళ్ళబుచ్చవచ్చు. అయినా యీనాటి మాధవికి ఏం కోరిక లున్నాయి? అసలు హృదయ ముంటేగా...

అసలీ కథంతా ఎందుకు వచ్చినట్లు? ఎవరు విని సానుభూతి చూపిస్తారని? లేకుంటే, ఎవరిని హెచ్చరిద్దామని? ఎందుకయినాసరే, నా జీవిత చరిత్ర, జైలు కటకటాల వెనుక నుంచుని నెమరువేసుకొంటే - నాకే గుణపాఠంగా కన్పిస్తూంది.

—౦౦౦—